# ఆమె అతడు

ఇదిల్లా? సత్రమా?

రాకరాక అత్తవారింటికొచ్చిన దీప్తికి... ఎందుకో ఆ ఇంటి వాతావరణం నచ్చలేదు.

విశ్రాంతి కోసం వస్తే ఎదురుగా కలవరపరిచే పరిస్థితులు. ఆమెకు చికాకుగా వుంటోంది. శ్రీపతి లేకుండా తను ఒక్కర్తే ఇక్కడికి రావడంతో అతడు లేని లోటు స్పష్టంగా కన్పిస్తోంది.

అతడు లేకుండా తను ఎక్కడికీ వెళ్ళదు. అతణ్ణి ఒక్కక్షణం కూడా విడిచి వుండలేదు. అతణ్ణి విడిచి తను రావాల్సిన పరిస్థితి ఇదే మొదటిసారి.

ఆమె, అతడు సహజీవనం చేస్తున్నది చెన్నైలో. వేర్వేరు సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈమధ్య తీవ్రపని ఒత్తిడిలో రాత్రీపగలనకుండా ఆమె బాగా నలిగిపోయి, పూర్తిగా నీరసించిపోయి డాక్టర్ వద్దకు వెళ్ళకతప్పని పరిస్థితి ఏర్పడింది. డాక్టర్ ఆమెకు అన్ని టెస్టులూ చేసి కొన్ని మందులు రాసేడు. మందులు కన్నా విశ్రాంతి ఆమెకు ముఖ్యమన్నాడు. నెలరోజుల పాటు బెడ్‌రెస్ట్ తీసుకోక తప్పదన్నాడు.

డాక్టర్ సలహాని శ్రీపతి సీరియస్‌గా తీసుకొని కచ్చితంగా పాటించదలిచేడు.

"నువ్విక్కడ వుంటే మీ కంపెనీ రాక్షసులు నీపై పడి ఏదోరకంగా నీ ప్రాణాలు తినేయడం ఖాయం. ఇక్కడ నీకు విశ్రాంతి దొరకదు. మా ఇల్లే నీకు అన్ని విధాల సురక్షితం" అన్నాడు.

"నువ్వు లేకుండా మీ ఇంటికి వెళ్ళను" అంది ఆమె.

అతడు ఆమెతో కలిసి బయిల్దేరడానికి సిద్ధపడ్డాడు. అంతలో అతడు

అర్జెంటుగా కంపెనీ పనిపై కోల్‌కతా వెళ్ళాల్సిరావడంతో, ఆమె ఒంటరిగా అత్త వారింటికి హైదరాబాద్ పోక తప్పలేదు.

విశ్రాంతికోసం వచ్చిన ఆమెకు అత్తవారిల్లు అన్నివిధాల బాగున్నది. ఆమెకు ఎటువంటిలోపం జరగకుండా అత్తయ్య తనను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నది. వచ్చిన వారం రోజులకే బాగా తేరుకుంది.

అత్తమామల హృదయాలు ఎంత విశాలమో ఇల్లుకూడా అంతే విశాలమైనది. నాలుగైదు కుటుంబాలు ఇబ్బంది లేకుండా వుండగలిగేటంత ఇల్లు. తాతలకాలం నాటి భవనం. పన్నెండు వందల చదరపు గజాల స్థలం అది. చుట్టూ ప్రవారీ. ప్రహరీ వెంబడి వరసగా, నిండుగా కొబ్బరి చెట్లు.

ఇంటికీ ప్రహరీకి మధ్య పచ్చపచ్చగా రకరకాల పూల మొక్కలు. రంగు రంగుల పూవులు. గుంపులు గుంపులుగా పావురాళ్ళు. వాటికోసం చెక్కతో చేయబడిన గూళ్ళు.

కాలుష్యనగరంలో పచ్చని తోట మధ్య ప్రత్యేకంగా కనిపించే అత్తవారింటిపై ఆమె ఆలోచనలు ఆందోళ కలిగిస్తున్నాయి.

ఆ యింటిపై పావురాళ్ళకున్నంత స్వేచ్ఛ ఎవరో పరాయి మనుషులకు కూడా వుండటం చూసి సహించడం ఆమెకు కష్టమౌతోంది. తోటకు పట్టిన చీడలా, గొంగళిపురుగుల్లా, గండు చీమల్లా ఎప్పటికప్పుడు మందలు మందలుగా ఎవరెవరో ఇంటిపై పడిపోవడం ఏమిటి?

ఎవరు వీళ్ళు?

ఒక వ్యాపార నిమిత్తమో, జూదం ఆడటం కోసమో, మందు తాగటం కోసమో, దైన ప్రార్థనల కోసమో, సరదా కబుర్లతో కాలాక్షేపం కోసమో వాళ్ళు వచ్చీ పోవడంలేదని ఆమెకు తెల్సు.

ఎవరు వీళ్ళు?

వీళ్ళకు అమెరికా మీద, ప్రపంచ బ్యాంకు మీద, ప్రపంచీకరణ మీద, ప్రైవేటీకరణ మీద, సరళీకరించిన ఆర్థిక సూత్రాల మీద, ఈ వ్యవస్థ మీద, ఈ ప్రభుత్వాల మీద, పోలీసుల మీద, మతం మీద, కులం మీద ఏమాత్రం సదభిప్రాయం లేనివాళ్ళు. నమ్మకం లేని వాళ్ళు.

వీళ్ళపై తనకు దురభిప్రాయం లేకపోయినా, అత్తవారిల్లు వాళ్ళకు వేదిక కావడం చూస్తూ, చూస్తూ భరించలేకపోతోంది.

అంతేకాదు, ఇరుగుపొరుగు జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి ఈ వూరు

వచ్చినవాళ్ళలో కొందరికి ఇక్కడే బస. ఎప్పుడూ ఇద్దరు ముగ్గురు పనివాళ్ళు కాదు కాదు సామాజిక సేవకులు అందుబాటులో వుంటారేమో... వంటగదిలో పొయ్యి వెలుగుతునే వుంటుంది.

ప్రపంచ రాజకీయ పరిణామాలు, ఆర్థిక సంక్షోభము, అభివృద్ధి పేరిట పేదల బతుకులపై చాపకింద నీరులా సాగే విధ్వంసమూ, దగాపడిన ఆడపడుచు లూ, రోడ్డునపడ్డ రైతులూ ఒకటేమిటి సమస్తమూ పొయ్యిమీద బియ్యం ఎసరులా కుతకుతమని అక్కడ ఉడుకుతుంటాయి.

రోజూ తను చూస్తున్నది ఎప్పుడూ ఏదొక హడావుడి. ఏవేవో చర్చలు, సమావేశాలు. నాయకత్వ బాధ్యతలు మావయ్యవి. సహాయ సహకారాలు అందించేది అత్తయ్య. వృద్ధాప్యంలో కూడా అత్తమామలు అంత సమర్థవంతంగా కార్యక్రమాలను ఎలా ఆర్గనైజ్ చేయగలుగుతున్నారు?

మావయ్యని సూర్యం మాస్టారు అంటారంతా. మాస్టారు అంటే ఏదో స్కూల్ మాస్టారు కాదు. రిటైర్డ్ ప్రొఫెసర్. వయసు 75 సంవత్సరాలు. ఆ ముసలాయన పాతికేళ్ళ యువకుడిలా పరుగులు తీస్తాడు.

అత్తయ్య శారద. వయసు 70. ఆమెకు బాధించే మోకాళ్ళ నొప్పి వ్యాధి వుంది. మందులు వాడుతుంది. అంతవరకే. ఆమె చేసే పనులేమీ ఆగవు. అప్పుడు ఏ నొప్పులూ వుండవు. హుషారుగా చేసుకుపోతుంది.

ఇద్దరికిద్దరూ సామాజిక సేవకి పూర్తిగా అంకితమైపోయేరు. ఎన్నాళ్ళిలా? విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో విశ్రాంతి తీసుకోకుంటే ఎట్లా?

దీప్తి అత్తవారింటికి రావడం ఇప్పుడేకాదు. గతంలో వచ్చింది. శ్రీపతితో కలిసి రెండు, మూడుసార్లు వచ్చింది. వచ్చినా వున్నది రెండు మూడు రోజులే. అప్పుడు ఈ పొలిటికల్ ఏక్టవిటీస్ వుండే వుండొచ్చుగాక. ఆమె పక్కన శ్రీపతి వుంటే చాలు... తన చుట్టూ ఏమి జరుగుతున్నదీ తెలియదు. ఆమెకు అనవసరం కూడా. అతడే ఆమె ప్రపంచం.

శ్రీపతి లేకుండా తనిక్కడ ఇంచుమించు నెలరోజులు వుండగలగడం విశేషమే. ఇక శ్రీపతి కూడా కోల్‌కతా టూర్ ముగించుకొని వచ్చేస్తున్నాడు. అతణ్ణి డైరెక్ట్‌గా హైదరాబాద్ వచ్చేయమంది. ఇక్కడ పరిస్థితులను సరిదిద్దాల్సిన పనివుంది. ఆ పనిచూసుకొని ఇద్దరం కలిసి చెన్నై వెళ్ళిపోదాం అంది. అందుకు అతడు ఓకే చేయలేదు. ఆఫీసు పని ఒత్తిడిపై డైరెక్ట్‌గా చెన్నై వెళ్ళక తప్పని పరిస్థితి అన్నాడు. అక్కడేమి నీ సొంత అభిప్రాయాలు వాళ్ళపై రుద్ది డిస్టర్బ్

చేయకుండా గప్‌చిప్‌గా వచ్చేయమన్నాడు అతడు.

ఆమెకు కోపం వచ్చింది. "ఇంటికోడలుగా నాకు బాధ్యతలు లేవా? ఇంటిని చక్కబెట్టే యత్నం చేయవద్దంటే ఎట్లా?" అంది ఆమె.

"ఏదైనా చెబితే వినేరకం కాదు నీవు. చేయాలనుకున్న పని ఆరు నూరైనా చేసి తీరుతావు" అన్నాడు.

"నా సంగతి తెల్సుకదా. అంచేత మీరిక వూరుకోండి. నేనిక్కడ చేయాల్సింది చేసే చైన్నె బయిల్దేరుతా" అంది దీప్తి.

ఏదైన అనుకోవాలేగాని, అది ఏదొకవిధంగా సాధించగలననే నమ్మకం ఆమెలో అపారం. అనుకున్నది చాలావరకు సాధించగలిగినందుకు ఆమెపై ఆమెకు గర్వం కూడా.

శ్రీపతి అంటే ఆమెకు ప్రాణం. కాని అతని అలవాట్లు, పద్ధతులు, ఇష్టాలు ఆమెకేమాత్రం నచ్చేవి కావు మొదట్లో.

అతనికి అప్పుడప్పుడు సరదాగా మిత్రుల మధ్య మందు కొట్టే అలవాటు వుండేది. ఈరోజు సరదా రేపు వ్యసనంగా మారితే? భయపడింది. నెమ్మదిగా తాగుడు మానిపించేసింది. అతనికిప్పుడు తాగడమంటే భయం.

థియేటర్‌కి వెళ్ళి సినిమా చూడటమంటే ఆమెకు మహా బోర్. తలనొప్పి. ఏదో టైమ్‌పాస్‌కి అప్పుడప్పుడు టీవీలో సినిమాలు చూడకపోదు. అతడు అలాకాదు. సినిమా అంటే పడి చస్తాడు. కొత్త సినిమా రిలీజ్ అయితే, తనకు నచ్చిన హీరోల చిత్రాలయితే మొదటిరోజే ఏదొకవిధంగా టికెట్ సంపాదించి చూసే అలవాటు ఇంటర్ చదువుల నుంచే వుంది. ఆ అలవాటు ఆమె తనలో సగం అయ్యేవరకూ నిరాటంకంగా సాగింది. ఆమెను వదిలి ఒక్కడూ వెళ్ళలేదు గదా. ఆమెను కూడా సినిమాకి రమ్మని పోరేవాడు. ఆమె అతడితో కలిసి ఒకటీ, రెండుసార్లు వెళ్ళకపోలేదు. వెళ్ళింది. తర్వాత నెమ్మదిగా అతని సినిమాక్రేజ్‌ని పూర్తిగా చంపేసింది. ఒకప్పుడు విపరీతంగా చూసేతను, ఇప్పుడు ఒక్క సినిమా కూడా చూడకుండా ఎలా వుండగలుగుతున్నాడో... తనే నమ్మలేని స్థితిలో వున్నాడు.

అతనికి క్రికెట్ చాలా ఇష్టం. ఆఫీసు ఎగ్గొట్టిమరి టీవీకి అతుక్కుపోతాడు. క్రికెట్ మ్యాచ్ వూళ్లో సందిడి చేస్తే టికెట్ కోసం అందరికన్నా ముందు లైన్ కడతాడు. ఆమెకు క్రికెట్ అంటే గొప్ప చిరాకు మహా మంట. కాని టెన్నిస్ అంటే చాలా చాలా ఇష్టం. టీవీలో క్రికెట్ పెట్టకూడని స్థితికి అతణ్ణి తీసుకు

వచ్చేసింది. టీవీలో టెన్నీస్ ఆమెతో ఆమెతో కలిసిచూస్తూ ఎంజాయ్ చేసేలా అతణ్ణి దిద్దుకుంది. అయితే అతడు పేపరు తీయగానే ముందుగా క్రికెట్ వార్తలు జోలికి వెళతాడు ఇప్పటికీ. అతని సరదాని ఆవిధంగా కుదించుకున్నాడు.

దేవాలయాలకు వెళ్ళి దేవుడికి దండంపెట్టే అలవాటు అతనికి వుండేది కాదు. గృహస్థుడయ్యేక ఆమెతోపాటు దేవాలయాలకి వెళ్ళక తప్పని స్థితికి వచ్చేసాడు. గుడికి వెళ్ళినా, ఆమె పక్కనే నిలబడినా చేతులెత్తి మాత్రం దేవుడికి దండం పెట్టడు. ప్రసాదం మటుకు తింటాడు. నవ్వుకుంటుంది దీప్తి.

ఇటువంటివి చాలా వున్నాయి. ఆమెకు నచ్చిన బట్టలే వేసుకుంటాడు. తినమన్న తిండే తింటాడు. ఏం చెబితే అది చేస్తాడు.

ఆమె కోరుకున్నరీతిలో శ్రీపతిని లైన్లో పెట్టుకోగలిగింది. ఆమె అనుకున్నది చేయగలుగుతుంది ఇంటా బయట కూడా. కంపెనీ యాజమాన్యం వారి మన్ననలు పొందింది. ఒక ఉత్తమ టీమ్ లీడర్‌గా ప్రశంసలు, అవార్డులు సాధించింది. సరిగ్గా పనిచేయని తన కొలిగ్స్‌ని కౌన్సెలింగ్ చేసి సరిచేయగలిగింది. వాళ్ళ కుటుంబ సమస్యల్లో తలదూర్చి, పరిష్కారాలు చూపి వాళ్ళ ముఖాల్లో నవ్వు వెలిగించగలిగింది. అంతటి శక్తి వుంది ఆమెలో.

అత్త మామలకు కౌన్సెలింగ్ చేసిన తర్వాతే తను చెన్నై వెళ్ళాలని ఒక నిర్ణయం తీసుకుంది. 'కోడలు పిల్ల చిన్నాపెద్ద లేకుండా మాకు కౌన్సెలింగ్ చేయడమా?' అని వాళ్ళు ఫీల్ అవ్వనిరీతిలో చాలా పకడ్బందీగా పథక రచన చేసుకుంది. అందుకు వాళ్ళు మంచి మూడ్‌లో దొరికే సమయం కోసం ఎదురుచూస్తోంది.

అంతలో ఒక సాయంత్రం ఆమె హఠాత్తుగా డిస్టర్బ్ అయింది.

కాలింగ్ బెల్ మోగడంతో తలుపులు తెరిచి నిశ్చేష్టురాలైంది.

ఎదురుగా గాయాలతో అత్తమామలు.

అత్తయ్య చీర చిరిగిపోయి, చిన్నచిన్న గాయాలతో స్వల్ప అస్వస్థతకి గురికాగా, మామయ్య మాత్రం తీవ్రంగానే గాయపడ్డాడు. నుదిటిపై పెద్దగాయం. తలకి కట్టువుంది. ఒళ్ళంతా కవుకుదెబ్బలు. అతని తెల్లటి షర్టు రక్తంలో ముంచి తీసినట్టు వుంది.

అత్తమామలను ఆ స్థితిలో చూసి దీప్తి తట్టుకోలేకపోయింది. జ్వరం వచ్చినట్టు వణికిపోయింది.

ఏదో ఎక్సిడెంట్‌లో తగిలిన దెబ్బలు కావు. లాఠీదెబ్బలు. స్పష్టంగా

కన్పిస్తున్నాయి. ఊరేగింపు, ధర్నా కార్యక్రమాలున్నాయని ఉదయం ఇంటినుంచి వెళ్ళిన వారు సాయింత్రం ఇలా లాఠీ దెబ్బలతో వచ్చేరు.

ఊరేగింపు, ధర్నా ఎందుకు చేస్తున్నదీ దీప్తికి తెల్సు.

ఆదివాసీ స్త్రీలపై సామూహిక అత్యాచారం జరిపిన కిరాతక పోలీసు గ్యాంగ్‌ను ప్రభుత్వం అరెస్టు చేయాలని ప్రజాసంఘాల డిమాండ్.

దీప్తి ఉద్యమాలకు, ఊరేగింపులకు దూరం కావొచ్చు. కాని అమాయక ఆదివాసీ స్త్రీలపై పోలీసుల దుర్మార్గాన్ని సహించలేకపోయింది. ఆమె గుండెలు మండిపోయాయి. చాలా బాధపడింది.

వివిధ ప్రజా సంఘాల ఊరేగింపు హోరెత్తినట్టు ఉప్పెనలా సాగింది. ఆ ఊరేగింపు హోంమినిస్టర్ ఇంటివరకూ సాగింది. ఆ యింటి ముందు ఉద్యమకారు లంతా ధర్నాకు దిగేరు. ధర్నాకి పోలీసులు ఒప్పుకోలేదు. అక్కణ్ణించి అందరూ వెళ్ళిపోవాలని హెచ్చరించేరు. ఎలాంటి హెచ్చరికలను లెక్కచేయకుండా ఉద్యమకారులు ఆగ్రహజ్వాలతో ధర్నాకు దిగేరు.

పోలీసులు కోపోద్రిక్తులై కర్కశంగా, క్రూరంగా, విచక్షణారహితంగా లాఠీలు విరిగిపోయేలా ఛార్జ్ చేసేరు.

ఉద్యమకారులు శాంతియుతంగా చేయాలనుకున్న ధర్నాని పోలీసులు హింసాయుతంగా భగ్నం చేయగలిగేరు.

ఆదివాసి స్త్రీలపై అత్యాచారం చేసిన పోలీసులు వీళ్ళు కాకపోయినా 'వాళ్ళే మేము. మేమే వాళ్ళు' అన్నంత కసిగా, ఆడామగా అని చూడకుండా చేతికి, లాఠీకి, బూటుకి దొరికిన వాళ్ళనందరినీ కుమ్మేశారు. చితకబాదేశారు. నలుగురైదు గురికి తీవ్రగాయాలయ్యేయి. అందులో మావయ్య ఒకరు.

అరెస్ట్ చేసి వేన్‌లో కుక్కేయడాలు, పోలీస్ స్టేషన్లో పడిగాపులు, ఆసుపత్రిలో వైద్యాలు, మీడియా హడావుడి వగైరాల నుంచి బయటపడి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చి కూలబడిపోయిన అత్తమామలను చూసి ఏడ్చేసింది దీప్తి.

"అయ్యో. తల్లీ ఏడ్వకమ్మా. ఇవేమీ పెద్దగాయాలు కాదు. ఇలాంటి పోలీసు ట్రీట్‌మెంట్ మాకు మామూలే" అని తేలిగ్గా నవ్వేసాడు మావయ్య

అతనున్న స్థితిలో ఎలా నవ్వగలుగుతున్నాడు!

ఆమె దుఃఖం బాధగా, కోపంగా, ఆవేశంగా మారిపోయింది. ఇన్ని రోజులు ఆమె గుండెల్లో రగులుతున్నదంతా అగ్నిపర్వతంలా పగిలి లావాలా గొంతులోంచి బయటకు ఎగతన్నుకొచ్చేసింది.

అత్తమామల నుంచి ఆమె రెండు విషయాల్లో మార్పు ఆశించింది.

"ఇంతకాలం మీరిద్దరూ ఒళ్ళు దాచుకోకుండా, ఇల్లు చూసుకోకుండా అంకితభావంతో ఒళ్ళునీ, ఇల్లునీ పూర్తిగా సమాజపరం చేసేశారు. దానిపై కామెంట్ చేయదల్చుకోలేదు. నా ప్రార్థన ఏమిటంటే మీ వయసుని దృష్టిలో పెట్టుకుని ఇకనైన మీరు మీ సామాజిక సేవకు ఫుల్‌స్టాప్ పెట్టేసి పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. తప్పదు. తప్పదు. తప్పదు. మీరు కొన్నాళ్లు మాతోపాటు చెన్నైలో వుంటే అన్నీ సర్దుకుంటాయని గట్టిగా నమ్ముతున్నాను.

మరో ముఖ్యమైన విషయం ఈ యిల్లు. పచ్చని తోట, రంగు రంగుల పూలు, అందమైన పావురాల మధ్య ముచ్చటగా వున్న ఇల్లు ఒక సామాజిక సత్రంగా సాగడం నాకెందుకో బాధగా వుంది. భరించలేకుండా వున్నాను. కొన్నాళ్ళ కిది పూర్తిగా సత్రమై పోతుందోమోనని భయం కూడా నాకు కలుగుతోంది. నగరం మధ్య పన్నెండు వందల గజాల స్థలమంటే మాటలు కాదు. బంగారమే బంగారం. ఈ స్థలంలో ఒక అధునాతనమైన, విశాలమైన ఒక షాపింగ్‌మాల్ లేపితే బ్రహ్మాండంగా వుంటుందని భావిస్తున్నాను. ఆ దిశగా ఆలోచించమని ప్రార్థిస్తున్నాను. నెలనెలా లక్షల్లో వచ్చే రాబడిలో పదిరూపాయలు కూడా మాకొద్దు. ఆ డబ్బు ఏం చేసుకుంటారో మీ ఇష్టం. ఆలోచించండి" అంది దీప్తి.

ఆమె ఒక పద్ధతిలో కౌన్సెలింగ్ చేద్దామనుకున్న విషయం ఇదే. ఏవిధంగా నైతేనేం అత్తమామలకు తను చెప్పాలనుకున్న విషయం చెప్పేసింది. వాళ్ళ స్పందన ప్రస్తుతం ఆమెకు అనవసరం. వాళ్ళను కుదిపి ఒక విత్తనం వేసింది. అక్కడ అతి తొందరలోనే షాపింగ్‌మాల్ అనే మహావృక్షం లేస్తుందని ఆమె గట్టి నమ్మకం.

***

దీప్తి, శ్రీపతిలది ప్రేమ వివాహం.

శ్రీపతి యమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్ళి, అక్కడ దీప్తి ప్రేమలో పడిపోయాడు.

ఆమె అతనిలా చదువుకోసం అమెరికా రాలేదు. ఆమె అమెరికాలోనే వుంటోంది. పదేళ్ళనుంచి. ఆమె తండ్రి అమెరికాలో చేస్తున్న ఉద్యోగాన్ని విడిచి ఇండియా రావడానికి ఇష్టపడకపోవడంతో, అతని కుటుంబం అమెరికాలోనే సెటిలైపోకతప్పలేదు. పన్నెండేళ్ళ వయసు నుంచి దీప్తి చదువులు అమెరికాలోనే సాగాయి.

దీప్తి, శ్రీపతి చదువులప్పుడు ప్రేమించుకున్నా, ఇద్దరూ ఉద్యోగస్తులయ్యేకే

వివాహం చేసుకున్నారు. వాళ్ళ వివాహానికి ఏ ఒక్కరి పేరెంట్స్ నుంచి వ్యతిరేకత రాలేదు.

కొత్త దంపతుల కాపురాన్ని హాయిగా సాగనివ్వకుండా ఆర్థికామాంద్యం భూతం అడ్డుగానిలిచింది. ఆరునెలల తేడాలో ఇద్దరి ఉద్యోగాలు ఊడిపోయేయి.

తర్వాత ఇద్దరూ ఎంతగా ప్రయత్నాలు చేసినా ఏ ఒక్కరికీ ఉద్యోగం దొరకలేదు. ఐటి కంపెనీలన్నీ తల్లడిల్లి పిల్లిమొగ్గలు వేస్తున్న దారుణ పరిస్థితి.

ఆరునెలల తర్వాత శ్రీపతి ఉద్యోగం సంపాదించుకోగలిగేడు. అమెరికాలో కాదు. చెన్నైలో

"ఇండియాలో ఉద్యోగం ఎట్టిపరిస్థితిల్లోను వద్దు. వద్దుగాక వద్దు. ఇక్కడ ఉద్యోగాలు దొరక్కపోవు" అంటూ అతనికి వచ్చిన ఉద్యోగాన్ని తోసి పుచ్చింది. అమెరికా వదిలి ఇండియా వెళ్ళడం ఆమెకేమాత్రం ఇష్టంలేదు.

చెన్నైలో వచ్చిన ఉద్యోగాన్ని వదులుకోవడానికి శ్రీపతి ఇష్టపడలేదు. దాంతో ఇద్దరి మధ్య ఘర్షణ.

"మొగుడు కావాలో, అమెరికా కావాలో తీరుబడిగా ఆలోచించుకో" అంటూ అతడు చెన్నై బయిల్దేరాడు.

"మై డియర్ దీపు. ఐ లవ్ యు. ఇండియా నువ్వెప్పుడొచ్చినా  నీ కోసం ఈ గుండె తలుపులు తెరిచేవుంటాయి" అన్నాడు ఆమెను విడిచి వెళ్తూ. "ఐ హేట్ యూ" అంది దీప్తి. ఆమెను, అమెరికాను అతడు నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్ళిపోవడం భరించలేకపోయింది. ఆమె ఎట్టిపరిస్థితిలోను అమెరికాని వదిలి వుండ లేదుగనుక అతణ్ణి పూర్తిగా మర్చిపోవడానికే నిర్ణయించుకుంది. ఆమె నిర్ణయానికి ఆమె తల్లిదండ్రుల నుంచి పూర్తి ప్రోత్సాహం లభించింది. కూతురు వాళ్ళ కళ్ళ ముందు వుండాలి. ఆమె చదువుకి మరో ఉద్యోగం దొరక్కపోదు, ఆమె అందానికి మరో మొగుడు దొరక్కపోదు – అదీ వాళ్ళ ధోరణి.

అయితే ఆమె తల్లిదండ్రులు మాటమాటకి శ్రీపతిని తిడుతూ అవమానిస్తూ వుంటే ఎంచేతనో సహించలేకపోయింది. 'ఇది మా ఇద్దరి మధ్య వ్యవహారం. అతణ్ణి మీరు ఏమన్నా ఒప్పుకోను' అని గొడవపడి వాళ్ళ నోళ్ళు మూయించింది.

ఆమె తీవ్ర ప్రయత్నాలు ఫలించి, తల్లిదండ్రులు వున్న వూళ్ళోనే మంచి ఉద్యోగం దొరికింది. పని ఒత్తిడిలో శ్రీపతిని మర్చిపోగలననుకుంది. సాధ్యం కాలేదు. తినే తిండి సహించ లేదు. రాత్రులు నిద్రపట్ట లేదు. శాంతిలేదు. సుఖం లేదు. పిచ్చెక్కినట్లయిపోతోంది. ఏడుపొస్తోంది.

అతడు లేకుండా తను బతకలేనన్న విషయం ఆమెకు స్పష్టమయ్యేక మరిక ఆలోచించలేదు. ఉద్యోగాన్ని, తల్లినీ, తండ్రినీ, ఆమెరికాని వదిలి చెన్నైకి చేరి అతని ఒడిలో వాలిపోయింది. అతనిలో ఐక్యమయ్యేక మనిషి కాగలిగింది. ఇక ఎట్టి పరిస్థితిల్లోను అతణ్ణి విడిచివుంటే ప్రస్తకేలేదని తీర్మానించుకుంది.

ఆమెకు చెన్నైలో ఉద్యోగం దొరికింది. జీతం అతని జీతంకన్నా ఎక్కువే. అసూయ లేదు అతనికి. సాఫ్ట్‌వేర్‌లో ఆమె తనకన్నా ప్రతిభావంతురాలని తెల్సు. ఆమె అన్నింటిలోను ఎక్కువే. వయసులో కూడా. ఆరు నెలలు పెద్ద.

ఎందులోనూ ఎక్కువ, తక్కువ అనే ప్రశ్నే రాకుండా. చీకుచింతా లేకుండా ఎంతో హాయిగా సాగుతున్న వాళ్ళ సంసారంలో అతడికి ఆమె, ఆమెకు అతడు తప్పా అక్కడ మరో ప్రాణి లేదు. బిడ్డలు వద్దనుకుంది దీప్తి.

ఆమె గుండెల్లో ప్రేమంతా భర్తకే తప్పా... బిడ్డల్ని కని ఆ ప్రేమను వాళ్ళకి పంచడం ఇష్టం లేదు. 'దీపు. ఒక బిడ్డను కనేస్తే పోలా' అని అతడు మారాం చేస్తే 'నువ్వే నా బిడ్డవురా, నువ్వు నాకు చాలురా' అని గట్టిగా గుండెలకు అదుముకుంది అతణ్ణి.

అవును. అతడు ఆమె అద్దాల్లో బిద్దే. అతనికి సంబంధించిన సమస్త విషయాలు ఆమే చూసుకుంటుంది. అతడు ఆమె చెప్పినమాట వింటాడు. ఏం చేయమంటే అది చేస్తాడు. అతణ్ణి మిత్రులందరూ భార్యా విధేయుడంటారు. అయితే అతని విధేయత అంతా ఆమెపై ప్రేమలో భాగమే తప్పా. తన వ్యక్తిత్వం కోల్పోయి భార్యకు దాసోహం అయిపోవడం మాత్రం కాదు.

***

"దీపు! ఏమిటిది. నీకేమైన పిచ్చెక్కిందా? బుద్ధీ బుర్రా లేకుండా ఇంత సంస్కార రహితంగా ప్రవర్తిస్తావనుకోలేదు. నీ పరిధిలో నువ్వు వుండకుండా చాలా చాలా హద్దు మీరేవు. మా అమ్మానాన్నలను గాయపరిచేవు నీ ప్రవర్తన ఏదో సామెత చెప్పినట్టువుంది. పెద్దవాళ్ళనుంచి ఏవో కొన్ని మంచి విషయాలు తెల్సుకొని వస్తావనుకుంటే... తిరిగేసి ఆ పెద్దలకే దిమ్మతిరిగిపోయేలా క్లాసు పీకేవు. దెయ్యాలు వేదాలు వల్లించడమంటే ఇదేమరి.

లాఠీదెబ్బలతో ఇంటికొచ్చిన వాళ్ళని విశ్రాంతి తీసుకోనివ్వకుండా ఇదే మంచి అవకాశంగా భావించి, నీ అసందర్భపు చచ్చు సలహాలతో ఆ లాఠీ దెబ్బలకన్నా తీవ్రంగా గాయపరిచావు. పైగా అదేదో దిక్కుమాలిన కౌన్సెలింగ్ చేసే అవకాశం రాలేదని, వచ్చుంటే బాగుండేదని నా ముందు తెగ బాధపడి

పోయావు. ఇప్పటికీ నీలో గిల్టీనెస్ కన్పించకపోవడం, 'అత్తమామలతో నేనలా ప్రవర్తించి వుండాల్సింది కాదు' అనే ఫీలింగ్ కలగకపోవడం నన్ను బాధిస్తోంది.

అసలు నీకంత ధైర్యం ఎలా వచ్చింది? కన్న కొడుకుని... ఈరోజుకి కూడా మానాన్న ముందు తలెత్తుకొని నిలబడే ధైర్యం నాకు లేదు తెల్సా?

ఏమిటమ్మా? మా ఇల్లు నీకు సామాజిక సత్రంలా కన్పించిందా. అక్కడ నీకుండటం ఇష్టంలేకపోతే మూటాముల్లే సర్దుకొని ఇక్కడికి వచ్చేస్తే అదివేరు. కాని నీవొక పెద్ద సలహా ఇచ్చిపారేశావ్. ఇల్లునీ, తోటనీ పడగొట్టేసి ఆధునిక షాపింగ్‌మాల్ లేపేయమన్నావు. అలాగే ఆలోచిస్తావుమరి. నీకు జీవితం అంటే సాఫ్ట్‌వేర్, షాపింగ్‌మాలూను. గొప్ప సలహా ఇచ్చావుతల్లీ.

తప్పునాదే. నీవిచ్చే సలహాలు తు.చ. తప్పకుండా నేను పాటించడం వల్ల- ఎవరికైనా సరే సలహాలిచ్చి పారేయగలననుకున్నావ్. నేను అన్నది రైటేనా? నా ఇష్టాలు, స్వీయ ఆనందాలు ఎన్నెన్నో నీ సలహాపై వదులుకున్నాను. నీతో రాజీపడ్డాను. దంపతుల మధ్య రాజీ అనేది ఒక మంచి ఆదర్శంగా గుర్తించే సెన్సు నీకేది? అంతా నీ గొప్పే అనుకుంటావు. అవతలవాళ్ళని చచ్చినట్టు లైన్లో పెట్టేసాననుకుంటావు. నీకున్నది అహమే తప్పా, వుండాల్సిన కామన్‌సెన్స్ కూడా నీకు లేదనిపిస్తోంది.

నువ్వు బుద్ధి బుర్రాలేని దానివి కాబట్టే నెలరోజుల పాటు మా ఇంట్లో వుండీ కూడా మా అమ్మానాన్నల జీవితాన్ని పట్టుకోలేకపోయావు. వాళ్ళ ఔన్నత్యాన్ని గుర్తించలేకపోయావు. నీలాంటి స్వార్థపరురాలికి వాళ్ళ ఆశయాలు, ఆదర్శాలు ఏం అర్థమవుతాయి? మానవ హక్కులు పోరాటాలు, ఉద్యమాలు అంటే నీకు అయోమయం. తలనొప్పి. టీ.వీ. తప్ప పేపరు చూడవు. పుస్తకాలు చదవవు. సభలు, సమావేశాలకు వెళ్ళవు.

నీకు నీ సుఖం తప్పా నీ చుట్టూ వున్న ప్రపంచం గురించి పట్టదు. అభివృద్ధి పేరిట ఈదేశంలో ఎంత విధ్వంసం సాగుతున్నదో నీకు అక్కరలేదు. పోరాటాలు, ఉద్యమాలు చేయకతప్పని ఒక ప్రమాదకరస్థాయిలో ఈరాజ్యం వుందంటే నీకు అర్థంకాదు.

సమాజంలో చెడుని చూసి చాలా కొద్దిమంది మాత్రమే ప్రతిఘటిస్తారు. వాళ్ళు లాఠీలకు, తూటాలకు భయపడరు. ధైర్యంగా నిలబడతారు. పోరాడుతారు. ఏ త్యాగానికైనా సిద్ధపడతారు. మా అమ్మానాన్న ఆ కోవలోకి వస్తారు. వాళ్ళు వృద్ధులు కారు. చివరి శ్వాస వరకూ వాళ్ళది యువరక్తమే. నిత్య చైతన్యమే.

ఎదురుగా వున్న సమస్యపై పోరాటమే తప్పా పైబడుతున్న వయసుని లెక్కచేయని, లక్ష్యపెట్టని మనుషులు వాళ్ళు.

అటువంటి వాళ్ళపై అర్ధరహితంగా నోరు చేసుకున్నావు. హర్ట్ అయింది వాళ్ళు కాదు నేను. నువ్వు చేసిన పనికి సిగ్గుపడి నీ తరపున క్షమాపణలు చెబితే మా అమ్మ ఏమన్నదో తెల్సా-

"క్షమాపణలు ఏమిటిరా నాయినా. కోడలు పిల్ల మమ్మల్ని ఏమన్నదని! చాలా మంచిపిల్లరా, తన మనసులో మాట దాచుకోకుండా సూటిగా, నిజాయితీగా ముఖం మీదే చెప్పేస్తుందిరా. ఎదుటివాళ్ళను ప్రేమించే హృదయం కలవాళ్ళే అలా మాట్లాడగలరు. ఈ ఓల్డ్‌ఏజ్‌లో అత్తమామలు ఎలావుంటే సుఖపడతారో చిన్నపిల్ల తనకుతోచిన రీతిలో నిర్భయంగా కుండబద్దలు కొట్టినట్లు చెప్పిందిరా. మీనాన్న ఒంటిపై లాఠీదెబ్బలు, రక్తపు మరకలు చూసి జ్వరం వచ్చినట్టు వణికిపోయిందిరా. భావోద్వేగంతో కోడలు ఏదో మాటాడినా...ఆ మాటల కన్నా తను కార్చిన కన్నీళ్ళే మమ్మల్ని కలవరపరిచేయిరా" అంది. అలాంటి అత్త మామలు నీవెన్ని జన్మలెత్తితే దొరుకుతారు? నువ్వు మనిషివి కాదు.

మా అమ్మా నాన్నలా నిన్ను క్షమించగలిగేటంత విశాలహృదయం నాకు లేదు. ఎందుకో నీపై పరమ అసహ్యం వేస్తోంది. నిన్ను భరించలేను. నన్ను విడిచి వెళ్ళిపో. తక్షణం వెళ్ళిపో. నీది షాపింగ్‌మాల్ కల్చర్ కాబట్టి నీకు రైట్‌ప్లేస్ అమెరికాయే. వెళ్ళిపో"-

భార్యపై సునామీలా విరుచుకుపడ్డాడు శ్రీపతి.

***

అమెరికా వెళ్ళిపోలేదు దీప్తి.

వెళ్ళని ఆమెను "ఎందుకు వెళ్ళలేదు? నన్ను విడిచిపొమ్మంటే ఎందుకు పోలేదు?" అని ఏరోజు ప్రశ్నించలేదు. పొమ్మనలేదు. అలాని ఆమెతో మాటాడటం లేదు. ఇంట్లో అతనితోబాటు మరోమనిషి వుందన్న విషయం గమనించనట్టే ప్రవర్తించేడు.

ఇద్దరి మధ్య నిశ్శబ్దాన్ని భరించలేకపోతోంది దీప్తి. అలా నిశ్శబ్దంగా చిత్రహింస పెట్టే బదులూ తనని తిట్టినా బాగుణ్ణు. కొట్టినా బాగుణ్ణు. పిచ్చెక్కిపోతోంది ఆమెకు.

ఏనాడు లేనిది ఆరోజు నాన్‌స్టాప్‌గా అతడు తనపై ఉప్పెనలా విరుచుకు పడిపోవడంతో నివ్వెరపోయి అవాక్కయింది. తను వెంటనే మాటకి మాట ఎదురు

చెప్పకుండా విచక్షణతో, నిగ్రహంతో బొమ్మలా వుండిపోయింది. అతడు తనపై ఎక్కుపెట్టిన సూటిపోటి మాటల్ని గుండెల్లో అండర్‌లైన్ చేసుకుంది. మొగుడు, అత్తమామల పట్ల భార్యగా, కోడలిగా తన ప్రవర్తన పేజీలను సమస్తం వెనక్కి తిరగేసి తాను సమీక్షించుకుంది.

తన తప్పు తెల్సుకుని అత్తయ్యకు ఫోన్‌లో క్షమాపణలు చెప్పింది. అత్తమామలు ఆ విషయాన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. "క్షమాపణలు ఏమిటి? అంత పెద్దమాటలెందుకమ్మా" అని అత్తయ్య మెత్తగా దెబ్బలాడి తనని ఎంతగానో ఓదార్చేరు. ధైర్యం చెప్పేరు.

ఆమె సమస్య అంతా మొగుడితోనే. అతడు ఏమాత్రం తగ్గలేదు. పూర్తిగా బిగిసుకుపోయేడు.ఆమె అతడికి క్షమాపణ చెప్పని రోజు లేదు. క్షమించేసి ఎప్పటి లానే తనతో ప్రేమగా వుండమని ప్రార్థించింది. ఉలకడు. పలకడు. కనికరంలేని కఠినశిల అయ్యేడు అతడు.

చిరాకుతోనో, పరాకుతోనో మాటాడకపోతాడా అని గోడతో మాటాడినట్టు, ఆత్మాభిమానం చంపుకొని అతడితో పదేపదే మాటాడేది. సెల్, ల్యాప్‌టాప్ ద్వారా ప్రయత్నించినా ఫలితం శూన్యం.

అతడి గాలి తగలనిదే ఆమెకు ఊపిరాడదు. అంత బలహీనురాలు. అతణ్ణి ఎలా ప్రసన్నం చేసుకోవాలో అర్థంకాక ఆమెకు పిచ్చెక్కిపోతోంది.

ఒకప్పుడు అతడు ఆమెకోసం తన సరదాలు, ఇష్టాలు త్యాగం చేసి ఆమె చెప్పినట్టు విన్నాడు కదా. ఇప్పుడామె అతని సరదాలను, ఇష్టాలను ఆమె ఇష్టాలుగా మార్చుకుని ఒకటీ ఒకటీ అమలుపరిచే యత్నం చేసింది.

అతనికిష్టమైన హీరో సినిమా రిలీజ్ అయితే మొదటిరోజే అతడికి తనకు రెండు టికెట్లు తీసుకువచ్చి బయల్దేరమని బ్రతిమలాడి భంగపడింది. ఉత్సాహ భరితంగా క్రికెట్ మ్యాచ్‌లు సాగుతున్నాయి. బుద్ధిగా టి.వి.లో క్రికెట్ పెట్టేది. బెడ్‌రూమ్‌కి వెళ్ళిపోయి మంచంపై కళ్ళు మూసుకునేవాడు. ఏం చేస్తుందిక?

చివరి అస్త్రంగా ఒకరోజు అతనికి ఇష్టమైన బ్రాండ్ విస్కీ బాటిల్ తెచ్చి ఎదురుగా బల్లపై పెట్టింది. ఐస్ క్యూబ్స్, టిక్కా చికెన్, వేపిన రొయ్యలు, ఒక గ్లాసు తెచ్చింది. తాగడే.

ఏం చేస్తుంది? బాటిల్ తనే ఓపెన్ చేసి, గ్లాసులో విస్కీ పోసి తాగమని ఇచ్చింది దీప్తి. తాగలేదు శ్రీపతి.

అతడు తాగకపోవడంతో ఆమెకు చిర్రెత్తుకొచ్చింది.

"నువ్వు తాగకపోతే ఈ గ్లాసులోది నేను తాగే పరిస్థితి ఏర్పడుతుంది" హెచ్చరించింది.

అతని ముఖంలో ఏ ఫీలింగ్ ఆమెకు కన్పించలేదు. గ్లాసుని ఎత్తి ఆమె కింద పెదవికి తాకించి, మరుక్షణం తాగేయబోతున్నట్లు నటించింది. గభాల్న వద్దని వారిస్తాడనుకుంది. గ్లాసుని చేత్తో విసిరి కొడతాడనుకుంది. ఏది అతడిలో చలనం? అతనిపై గోడ నయం. ఆమెకు నిలువెత్తున మండిపోయింది. ఏనాడు తాగని ఆమె ఎత్తిన గ్లాసు దించకుండా గుటుక్కుమని తాగేసింది. గొంతు మండింది. గుండెలు భగ్గుమన్నాయి. ఆమె అంతటితో వూర్కోలేదు. మళ్ళీ గ్లాసు నింపింది. గ్లాసులో విస్కీని అతనికి చూపిస్తూ–

"ఇది నీకివ్వడానికి కాదు. నేను తాగడానికి. అవును. తాగాల్సిన పరిస్థితి నీది కాదు. నాది. నాకిదే మందు" అంటూ తాగేసింది. అలాగే మరో గ్లాసు. ఒళ్ళంతా ఆమెకదోలా వుంది. తాగిన మందు ఆమెపై విపరీతంగా పనిచేయడంతో అతనిపై గట్టిగా నోరు చేసుకుంది.

"ఒరేయ్ శ్రీపతీ. నీ జిమ్మడ. ఎందుకురా నన్నిలా ఏడిపిస్తావ్. మీ అమ్మా నాన్న పట్ల నా ప్రవర్తన బాగోలేదని అలిగావు. నాపట్ల నీప్రవర్తన ఏంబాగుందిరా? మీ అమ్మానాన్న చాలా తేలిగ్గా తీసుకున్న విషయాన్ని నువ్వు సీరియస్‌గా తీసుకోవడం ఏమిటీ? నన్నింత కిరాతకంగా శిక్షించడం ఏమిటి? ఇదేమైన న్యాయంగా, ధర్మంగా వుందా?

నన్ను నిర్దాక్షిణ్యంగా అసహ్యించుకుంటున్న నిన్ను ఏదొకవిధంగా తృప్తిపరచ డానికి దేనికైనా సిద్ధపడ్డాను కదరా. నీకాళ్ళు పదిసార్లు పట్టుకొని వందసార్లు క్షమాపణలు చెప్పాను కదరా. ఇంకేం చేయాలిరా నేను? నీ బాంచను కాల్మొక్త. చెప్పు నువ్వేం చేయమంటే అది చేస్తాను. దయచేసి నాతో ఎప్పటిలా ప్రేమగా వుండరా. నాకు పిచ్చెక్కిపోతోందిరా. నువ్వు లేకుండా నేనుండలేనన్న సంగతి నీకు తెల్సుకదరా, అవునా.ఆ బలహీనతపై ఇంకెంతకాలం స్వారీచేసి నన్ను ఏడిపిస్తావురా నాకొడుకా. ఇకనాకు ఓపికలేదురా. ఇదిగో ఇప్పుడే నిన్ను పీకపిసికి చంపేసి నేను కూడా హాయిగా చచ్చిపోతానురా" అంటూ బలహీనమైన ఆమె చేతుల్ని అతని మెడచుట్టూవేసి, అంతలోనే అతనిపై దబ్బున పడిపోయింది. మరిక లేవలేకపోయింది.

నవ్వుకున్నాడు శ్రీపతి.

ఆమెను ఎత్తుకుని బెడ్‌రూమ్‌లో పడుకోబెట్టేడు. దుప్పటికప్పి, ఆమెను

చూస్తూ చాలాసేపు వుండిపోయేడు.

ఉదయం అతడు లేచేడు. ఆమెలేవలేదు.

'మహాతల్లి. తాగింది దిగినట్టులేదు' నవ్వుకున్నాడు. గబగబా ఆఫీసుకు బయల్దేరాడు.

ఈరోజు నుంచి తన మౌన ప్రదర్శనకి చెల్లు. ఆమెనిక ఏడ్పించడు. ఆమెపై బెట్టు చేయడు. మెట్టు దిగిపోయేడు. ఆమెకు అతడెంతో. అతడికీ ఆమె అంతే. ఆమెకు ఎడంగా వుండలేని స్థితికి వచ్చేసాడు. ఆఫీసునుంచి వచ్చేక ఆ రాత్రి ఆమెను దగ్గరకు తీసుకోవాలనుకున్నాడు.

అతడు, ఆమె ఉద్యోగాలు చేసుకొని ఇంటికి తిరిగొచ్చే సమయం రాత్రి ఏడు, ఎనిమిది గంటల తర్వాతే. ఆమె కంపెనీ వేరు. అతడి కంపెనీ వేరు. ఆరోజు అతడు ఆమెకోసం ఇంటికి వేగంగానే వచ్చేసాడు. ఏం లాభం? రాత్రి ఏడయింది. ఎనిమిదయింది. ఆమె రాలేదు. తొమ్మిదయింది. ఆమె రాలేదు. పదయినా ఆమె రాకపోవడంతో అతనిలో ఆందోళన.

ఏమయ్యింది?

తనపై విసిగిపోయి ఆత్మహత్య చేసుకోలేదుకదా.

గుండెలు దడదడలాడేయి. వణుకుతున్న చేతితో సెల్ అందుకుని ఆమెకు ఫోన్ చేయబోయాడు.

అంతలో అతడికే ఫోన్.

దీప్తి కాదు. అమ్మ. హైదరాబాద్ నుంచి ఫోన్.

"కోడలు సురక్షితంగా మావద్దకు చేరింది. ప్రశాంతంగా నిద్రపోతోంది. కంగారుపడకు. నీవు కూడా ప్రశాంతంగా నిద్రపో" అని ఫోన్ పెట్టేసింది అమ్మ.

షాక్ తినేసాడు శ్రీపతి.

ఏం నిద్రపోతాడు.

ఇంకేం ప్రశాంతత!

***

ఆమె అత్తవారింటికి వెళ్తుందని తను ఏ మాత్రం ఊహించలేకపోయేడు. ఆమె అమెరికా వెళ్ళిపోయినా అంతగా ఆశ్చర్యపోయేవాడు కాదేమో.

అమెరికా అయితేనేం? హైదరాబాద్ అయితేనేం. ఆమె తనని విడిచి వెళ్ళిపోయింది. ఆమె ఏదొక చోటుకి పారిపోయి తలదాచుకునేలా చేసిన దుర్మార్గం

తనదే అనుకొని బాధపడ్డాడు శ్రీపతి.

హైదరాబాద్‌లో అతని తల్లిదండ్రుల పట్ల ఆమె అతిగా ప్రవర్తించిందనే ఆగ్రహంతో తనేం చేశాడు? ఆమె పట్ల తను కూడా అతిగా అర్ధరహితంగా, నిర్దాక్షిణ్యంగా మూర్ఖంగా ప్రవర్తించేడు. ఆమె అతడి నుంచి ఎక్కడికో పారిపోయేలా చేసాడు. స్వయంకృతం.

మర్నాడు ఉదయమే అతడు హైదరాబాద్ వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. హడావుడిగా బట్టలు వగైరా సూట్‌కేస్‌లో సర్దుకున్నాడు. ఎయిర్‌టికెట్ కన్‌ఫర్మ్ చేసుకున్నాడు. ఇంతాచేసి బయల్దేరబోతున్న వాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు. అతడి ప్రయాణాన్ని కేవలం అతని అహం అడ్డేసింది.

ఇంతవరకూ ఆమెపై వీర బెట్టుచేసి, పట్టు బిగించి ఇలా హఠాత్తుగా జారి పోవడం ఒకవిధంగా ఆమెకు సరెండర్ అయిపోవడమేకదా. ఆమె వద్దకు తను పరిగెట్టడం కాదు. ఆమే తన వద్దకు పరుగున రావాలి. ఎందుకురాదు? వస్తుంది. వచ్చి తీరుతుంది. ఆమె బలహీనతలు ఆమెకంటే తనకే బాగా తెల్సుననుకున్నాడు.

అతడి హైదరాబాద్ ప్రయాణం ఆగిపోయింది.

అయితే అతడు అనుకున్నట్టు జరగలేదు. 'నాథా! నాకు ప్రసాదించు నీ పాద ధూళి' అన్నట్టు ఆమె ప్రాధేయపడలేదు. అతని వద్దకు వచ్చే ప్రయత్నమూ చేయలేదు.

ఎందుకురాదు? వస్తుంది. వస్తుంది అని అతడు ఏరోజుకారోజు అనుకుం టుండగనే రోజులు వారాలుగా, వారాలు నెలలుగా అతి దుర్భరంగా దొర్లిపోయేయి. రెండునెలలు దాటినా ఆమె అతని వద్దకురాని స్థితి!

దాంతో అతడు గోళ్ళు కొరుక్కోవడం, జుట్టుపీక్కోవడం లాంటి పిచ్చిచేష్టలకు లోనయ్యేడు. కాలుకాలిన పిల్లి అయ్యేడు.

అతడి అహాన్ని ఆమెకు దాసోహం చేసేస్తూ.. ఎప్పటికప్పుడు హైదరాబాద్‌కి పరుగులు తీయబోయేవాడు.

"శ్రీపతీ. నాకు తెల్సు. ఏదొకరోజు నావద్దకు పరిగెట్టుకు వస్తావని తెల్సు. నీతో ఇలా పరుగులు తీయించడానికే నేనిక్కడికి వచ్చాను తెల్సా" అని చులకన చేస్తూ ఆమె విజయగర్వంతో నవ్వుతున్నట్టు అనిపించేది. అతని కాలు ముందుకు పడేదికాదు.

తను లేకుండా అక్కడ నెలల తరబడి ఆమె ఎలా వుండగల్గుతోంది? 'నన్ను కాదనకురా. ఏలుకోరా. నీకు పుణ్యముంటుంది' అని కాళ్ళావేళ్ళాపడి, కుమిలి

కుమిలి ఏడ్చినట్టు ఏడ్చి... ఇప్పుడు తనని ఏడిపిస్తోంది. ఏమైంది తనకి?

కనీసం ఆమెనుంచి ఒక ఫోన్‌కాల్ కూడా లేదు. తను కూడా ఫోన్ చేయదల్చుకోలేదు. ముందుగా ఆమే చేయాలి. అంతే.

అయితే అక్కడి విషయాలు అతనికి తెలుస్తున్నాయి. అతని తల్లి ఫోన్ ద్వారా తెలియజేస్తుంది ఎప్పటికప్పుడు.

ఆ విషయాలు అనూహ్యమైన విశేషాలు.

కోడలు పిల్ల తమతో పూర్తిగా కలిసిపోయిందట. ఇంటి చుట్టూ పచ్చగా పరుచుకున్న మొక్కల్లో తనూ ఓ మొక్క అయిందట. పూవుల్లో పూవు అయిందట. పావురాళ్ళ మధ్య ఒక పావురమై కువకువలాడుతున్నదట.

అంతేకాదు. అక్కడ జరుగుతున్న సభల్లో, సమావేశాల్లో, రాజకీయ చర్చల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నదట. ఆమెకు తెలియని విషయాలు ఎన్నెన్నో అడిగిమరి తెల్సుకుంటున్నదట. చదవమన్న పుస్తకాలు చదువుతున్నదట!

దీప్తిలో అంత మార్పా! చిత్రంగా వుందే. తనేకాదు ఆమె నేచరూ, కల్చరూ ఎరిగిన వారెవ్వరూ నమ్మరు. స్వయాన తల్లి చెబుతున్నది గనుక నమ్మకుండా ఎలా వుండగలడు?

ఏ ఇంటిని కూలదోసి ఒక ఆధునిక షాపింగ్‌మాల్ లేపితే అద్భుతంగా వుంటుందని బోడి సలహా ఇచ్చిందో... ఇప్పుడు అదే ఇంట్లో తను అత్తమామలతో పాటు సామాజిక సేవ చేస్తోంది! ఆమెను తను అసహ్యించుకొని దూరం చేసుకోవడం వల్ల ఆమెలో ఈ అనూహ్య మార్పు వచ్చిందా?

"మీ ఆవిడ గురించి నేను చెబుతున్నదేదీ నమ్మలేకపోతున్నావు కద" అంది అమ్మ.

"అవునమ్మా" అన్నాడు శ్రీపతి.

"దీప్తి గురించి నీకు చెప్పింది చాలా తక్కువ. ఈమధ్య తనో సాహసం చేసింది. అది చెబితే నీవు దంగై పోతావు తెల్సా"

"చెప్పమ్మా. నీ కోడలు సాహసకథ వింటాను"

"కథకాదు. వాస్తవ సంఘటన. 'ఆదివాసీ స్త్రీలపై పోలీసుల అత్యాచారం' కేసు విషయం నీకు తెల్సుకదా. ఈమధ్య నిజనిర్ధారణ కమిటీ ఒకటి ఆ ఏజన్సీ ప్రాంతానికి వెళ్తుంటే, వాళ్ళతోబాటు తనుకూడా పట్టుదలగా బయల్దేరింది. వెహికిల్స్ ఆదివాసీలగూడెం వరకూ వెళ్ళలేవు. వెహికల్ దిగి నాలుగైదు కిలోమీటర్లు నడవాలి. నడిచింది దీప్తి. ఏమీ కాకుండా, కమిటీ సభ్యులతో కలిసి, బండలూ

కొండలూ ఎక్కుతూ, చెట్లూ పుట్టలూ దాటుకుంటూ గూడెం చేరుకుంది. బాధిత స్త్రీలను పరామర్శించింది. గూడెం పరిసరాలను, ఆదివాసీల జీవనవిధానాన్ని పరిశీలించింది. గూడెంకి వెళ్ళివచ్చిన తర్వాత 'నేరకపోయి వెళ్ళాను బాబోయ్' అని కాళ్ళనొప్పులతో మంచమేక్కేస్తుందనుకున్నాను. కాని కోడలు పిల్లలో ఎటువంటి అలసట లేదు. బాధలేదు. నా బదులుగా వెళ్ళింది. మొత్తం తన ఎక్స్‌పీరియన్సూ, ఫీలింగ్సూ గంటల తరబడి ఉద్వేగంతో చెప్పింది. అదంతా నీకు చెప్పడం సాధ్యం కానిపని. మీ ఆవిడే నీకు చెబితే బాగుంటుంది"

"అలాగా. అయితే ఆవిణ్ణే చెప్పమను"

"ఎలా చెబుతుందిరా కొడకా. కోడలుతో పూర్తిగా, నిర్దాక్షిణ్యంగా మాటాడటం మానేసి మొండికేసావు. మామాట కూడా లక్ష్యపెట్టకుండా తనని ఒంటరిచేసి ఏడిపించావు. ఎంతగా ఏడిపించావంటే నీవద్ద ఆమెకు స్థానం లేదనుకుంది. మమ్మల్ని ఆశ్రయించింది. మీ ఇద్దరి మధ్య అంతగేప్ వుంటే తన మనసులోమాట ఏదైనా సరే నీతో ఎలా చెప్పుకోగలదు?" అంది అమ్మ.

"తప్పు నాదేనమ్మా. సిగ్గుపడుతున్నాను" అన్లేకపోయాడు కొడుకు.

"అమ్మా. నేనొకటి చెబుతాను. చేస్తావా" అన్నాడు.

"ఏమిటి చేయాలి?"

"మీ కోడల్ని ఉన్నపాటున ఇక్కడికి పంపించేయాలి. నెలల తరబడి ఉద్యోగం మానేసి అత్తవారింటికి అంటుకుపోయి వుండిపోతే ఎట్లా? అటు వాళ్ళాఫీసు నుంచి నాపై ఒత్తిడి. అంచేత వెంటనే బయల్దేరేలా చూడు"

"ఈ విషయం కోడల్ని ఎప్పుడో అడిగానురా. ఆ యాంత్రిక ఉద్యోగపు చాకిరీ కన్నా తనకు ఇక్కడే బాగున్నదట. చెన్నైలో ఉద్యోగం చేయదట"

"ఉద్యోగం చేయనీయ్, చేయకపోనీయ్. కాని అదే చెన్నైలో మొగుడొకడున్నాడనే విషయం మర్చిపోయిందా" ఉద్వేగంతో తను బయటపడిపోయేడు.

"మొగుడక్కర్లేదనుకుంటే ఇక్కడ వుండేదికాదు. ఎప్పుడో అమెరికా వెళ్ళిపోయేది. అమెరికా వచ్చేయమని దీప్తి అమ్మానాన్నా ఇప్పటికీ ఒత్తిడిచేస్తున్నారు తెల్సా. ఆమెకు మొగుడు అక్కర్లేదా అని ప్రశ్నిస్తున్నావు. పెళ్ళాంతో కాపురం చేద్దామనుకునే వాడెవడూ నీలా ప్రవర్తించడు అంటోంది దీప్తి".

"నేనలా ప్రవర్తించడానికి కారణం ఆవిడే. అయినా గతాన్ని తవ్వుకోవడం అనవసరం అమ్మా. నీ కోడల్ని వెంటనే ఇక్కడికి పంపించేయ్"

"నీ పెళ్ళాన్ని నేను పంపడమేమిటి? నేనేమి తీసుకురాలేదే. తనే వచ్చింది.

నీకు పెళ్ళాం అవసరం అనుకుంటే నీవే ఫోన్ చేసి రమ్మను. తన సెల్ నెంబరు నీ దగ్గరుంది కదా. ఫోన్ చెయ్. ఆల్ ద బెస్ట్" అని ఫోన్ పెట్టేసింది తల్లి.

ఆ ఊపులో దీప్తికి ఫోన్ చేసాడు శ్రీపతి.

దీప్తి ఫోన్ తీసింది. శ్రీపతి కాల్ అని తెల్సు. అతని రిక్వెస్టుకి ఆమె నోరు విప్పి స్పందించలేదు. ఆమెకు కన్నీళ్ళే వచ్చాయి. కన్నీళ్ళ చప్పుడు అతనికి ఏం వినిపిస్తుంది. అతడు నాలుగైదు సార్లు ఫోన్ చేసినా ఎలాంటి స్పందనా ఆమె నుంచి వినిపించలేదు.

"అమ్మా. దాని పొగరు చూడు" అని తల్లికి ఫోన్ చేసి చెబుదామనుకున్నాడు అతడు.

"మీ ఇద్దరూ తేల్చుకోవాల్సిన వ్యవహారం. మధ్యకి నన్ను లాగొద్దు" అని తప్పుకుంటుంది. అమ్మ సంగతి అతడికి తెల్సు.

అమ్మ సాయం ఎందుకు? చేతకాని వాళ్ళకే మరొకరి సాయం కావాలి. తను చేతకాని వాడేమీ కాదు.

దీప్తిని తీసుకురావడానికి ఉన్నపాటున హైదరాబాద్ బయల్దేరాడు శ్రీపతి.

రాముడి వెంట సీతలా తనవెనుక బుద్ధిగా వచ్చిందా సరి. రానని మొండికేస్తే రావణాసురుడిలా ఆమెను ఎత్తుకొచ్చేసే ఊపులో వెళ్ళాడు అతడు.

*(పాలపిట్ట - జూలై 2012)*